


# ప్రేమ పక్షులు

యర్రమిల్లి శేఖర్

ఆ రోజు నేను ఏను గెక్కినంత సంబరపడ్డాను. అయినా మనసులో ఒక మూల కొద్దిపాటి భయం తొంగిచూసిన మాట కూడా నిజం. కాని నాలోంచి ఆనందపు వెల్లువ ఆ భయాన్ని మనసు అట్టడుగు పొరల్లోకి నెట్టేసింది.

ఆఫీసులో నాకు ప్రమోషన్ వచ్చినట్లు తెలిసిన రోజున, ఆఫీసువాళ్ళు నాకు న్యాయంగా ఇవ్వవలసిన ప్రమోషన్ ఇచ్చినట్లు, అతి సహజంగా అనిపించిందే తప్ప, ఇంతటి సంతోషం కలగలేదు. నా సంతోషానికి కారణం సంపూర్ణంగా మీకు తెలియాలంటే నా గురించి మీకు వివరించాలి.

బారసాల నాడు మా పెద్దలు చాలా పొడవైన పేరే పెట్టినా, లోకం నన్ను 'ప్రకాశం'గానే గుర్తించింది. నేను ఊహ వచ్చి దగ్గర్నుండి నాటకాలు చూస్తున్నాను. వయసు వచ్చిం దగ్గర్నుండి నాటకాలు వేస్తున్నాను.

'కన్యాశుల్కం' దగ్గరనుండి 'కనకపుష్య రాగం' వరకు నేను వెయ్యని నాటకం లేదు. నాటకం అనే మాట వింటే నాగస్వరం విన్న నాగులా నా అణువణువులోను ఉత్సాహం పరవళ్ళు తొక్కుతుంది, అయితే నాటకాలనే నమ్ముకొని బ్రతకడం ఈ సమాజంలో అసాధ్యం కనుక, జీవనోపాధి కోసం నే నొక ఉద్యోగం చేస్తున్నాను. నాకు సంవత్సరం మొత్తంలో లభించే సెలవు లన్నిటినీ నేను నాటకాల కోసమే వాడుతుంటాను. జీతం నష్టం మీద సెలవు పెట్టి నాటకాలు వేసిన సందర్భాలు కూడా చాలా ఉన్నాయి.

నేను వేసిన నాటకాలు అన్నీ ఒక ఎత్తయితే 'ప్రేమపక్షులు' నాటకం ఒక్కటీ ఒక ఎత్తు. 'తెలుగువాళ్ళు నాటకాలను ఆదరించడం లేదు' అనే అభిప్రాయం కలిగినవాళ్ళు ఎవరైనా ఉంటే,

'ప్రేమపక్షులు' నాటకానికి లభించిన ఆదరణ చూశాక, తమ అభిప్రాయం తప్పక మార్చుకుంటారు.

ఆంధ్రదేశంలోనూ, ఇతర రాష్ట్రాలలోనూ కలిపి మా కళానమితి 'ప్రేమపక్షులు' నాటకాన్ని వందకు పైచిలుకు ప్రదర్శనలు ఇచ్చింది. చాలా పరిషత్తుల్లో బహుమతులు గెలుచుకోవడం మాట అటుంచి, వేసిన ప్రతిచోటా మా నాటకానికి అపూర్వమైన ఆదరణ లభించింది.

అయితే ఉన్నట్లుండి ఎవరిదో శాపం తగిలినట్లు, ఏడాది క్రితం రమాకాంత్ మరణించడంతో 'ప్రేమపక్షులు' నాటకానికి ఒక్కసారిగా తెర పడిపోయి నట్లయింది.

రమాకాంత్ మా నాటకానికి 'హీరో' అనటం కంటే, ప్రాణం అనటం సమంజసంగా ఉంటుంది. హీరో 'గోపి' పాత్రలో అతడు తనకు తానే సాటి అన్నట్లు నటించేవాడు. హీరోయిన్ 'మంజుల' పాత్రలో కళ్యాణి కూడా అంత చక్కగానూ నటించేది. మా నాటకంలో ఉన్న సామాజిక స్పృహ, రచనా చమత్కృతికి తోడు వాళ్ళిద్దరి పాత్ర పోషణ నాటకం రక్తి కట్టడానికి ముఖ్యమైన కారణాలు అన్నది నిర్ద్వంద్వమైన నిజం.

మర్యాదస్తులైన మధ్య తరగతి కుటుంబాలకు చెందిన ఆడపిల్లలు నాటకాలకు దూరంగా ఉంటారు అనే నమ్మకాన్ని కళ్యాణి వమ్ము చేసిందనే చెప్పాలి. విశాలమైన కళ్ళు, అందమైన నాసిక, పలుచటి పెదిమలు, ఇలాంటి అందాల నెన్నిటినో సొంతం చేసుకున్న కళ్యాణి నాయికగా నటించడం వలన మా నాటకానికి ఎనలేని శోభ చేకూరింది. ఆమె నాటకాల పట్ల ఇష్టంతో మా నాటకంలో నటిస్తోందా? లేదా రమాకాంత్ పట్ల కలిగిన ఆకర్షణ ఆమెను నాటకంలోకి తీసుకువచ్చిందా? అనే విషయం నేను ఖచ్చితంగా చెప్పలేను కానీ 'ప్రేమపక్షులు' నాటకం వాళ్ళిద్దరి జీవితాల్ని చాలా సన్నిహితం చేసిందనే మాట మాత్రం వాస్తవం.

వా రిద్దరి మధ్య పరిచయం ప్రణయంగానూ, ప్రణయం, పరిణయంగానూ మారటానికి ఎక్కువ రోజులు పట్టలేదు. అయితే విచారించదగ్గ విషయం ఏమంటే వారి దాంపత్య జీవితం మాత్రం ఎక్కువ సంవత్సరాలు కొనసాగలేదు. రమాకాంత్ కున్న తాగుడు వ్యసనమే అందుకు కారణం. అతడు విపరీతంగా తాగేవాడు. చివరికి ఆ తాగుడే అతణ్ణి పొట్టన పెట్టుకుంది. అతడు చనిపోయేనాటికి కళ్యాణికి రెండేళ్ళ కూతు రున్నది. నాలాగే మా 'కళానమితి'లో సభ్యులందరూ ఏదో ఒక ఉద్యోగం చేస్తున్నవాళ్ళే. రమాకాంత్ చనిపోయాక వాళ్ళ ఆఫీసువాళ్ళు కళ్యాణికి ఉద్యోగం ఇచ్చారు.

రమాకాంత్ వ్యక్తిగత జీవితం విడిచి పెడితే నా దృష్టిలో అతడు తిరుగులేని నటుడు. కన్యాశుల్కంలో 'గిరీశం' కానివ్వండి, కీర్తిశేషుల్లో 'మురారి' కానివ్వండి, ఏ పాత్ర ధరించినా అతను ఆ పాత్రను కళ్ళ ముందు నిలబెట్టేవాడు. ఇక 'ప్రేమపక్షు'ల్లో గోపి పాత్ర గురించి చెప్పనక్కర్లేదు. రమాకాంత్ ఆ పాత్ర పోషణ తనకే సొంతం అన్నట్లు నటించేవాడు. అతడి నటన నన్ను ముగ్ధుణ్ణి చేసేది. నాకు తెలియకుండానే అతని పట్ల నా మనసులో ఒక ఆరాధనా భావం శాశ్వతంగా చోటు చేసుకుంది. అందుకే అతని మరణవార్త విన్నప్పుడు నేను బాగా చలించిపోయాను. రెండు, మూడు రోజుల వరకు మామూలు మనిషిని కాలేకపోయాను. అతడు లేని 'ప్రేమపక్షులు' నాటకాన్ని నేను ఊహించుకోలేకపోయాను.

ఏడాది నుంచి స్తబ్దంగా నడుస్తున్న నా జీవితంలోకి రమాకాంత్ జ్ఞాపకాలు మరుగున పడుతున్న తరుణంలో, మా డైరెక్టరు వెంకటేశం గారి దగ్గర్నుండి వచ్చిన ఉత్తరం ఒక కొత్త ఉత్సాహాన్నీ, చైతన్యాన్నీ మోసుకొచ్చింది.

'ప్రేమపక్షులు' నాటక ప్రదర్శన తిరిగి ప్రారంభిస్తున్నామని, ఇకముందు ఇవ్వబోయే ప్రదర్శనల్లో 'హీరో గోపి' పాత్ర నన్ను వెయ్యవలసిందిగా కోరుతూ ఆయన రాశారు. ఆ ఉత్తరం చదివాక నా ఆనందానికి అవధులు లేవు. ఆ ఉత్తరం పది పన్నెండుసార్లయినా చదువుకొని ఉంటాను. నేను ఎంతగానో అభిమానించే హీరో పాత్ర ధరించే అవకాశం నాకు కల్పించిన వెంకటేశంగారు నాకు ఆ క్షణంలో దేవుడిలా అనిపించారు. ఒకవైపు ఇంతటి ఆనందంతో ఉబ్బి తబ్బిబ్బు అవుతున్నా, మరోవైపు పాత్రకు న్యాయం చెయ్యగలనో, లేదో అనే భయం కూడా మొదలైంది. కళ్యాణి ఎప్పటిలా 'మంజుల' పాత్ర ధరించడానికి అంగీకరించిందని కూడా ఆ ఉత్తరంలో రాశా రాయన.

ఇప్పటిదాకా నాటకంలో నేను 'చలపతి' పాత్ర వేస్తూ వచ్చాను. ఆ పాత్ర నాటకానికి కీలకమైనదే అయినా, మొత్తం నాటకంలో పదిహేను నిమిషాలకు మించి కనిపించదు. ఇకముందు నాటకంలో ఆద్యంతమూ కనిపించే హీరో పాత్ర నేను ధరించబోతున్నాను. ఉత్తరం మడిచి పక్కనున్న టీపాయ్ మీద పెట్టి గది గోడ వైపు దృష్టి సారించాను.

ఆ గోడకు ఒక ఫోటో వేలాడుతోంది. ఆ ఫోటోలో గోపి, మంజుల పాత్రలు నటిస్తున్న రమాకాంత్, కళ్యాణి ఉన్నారు. ఒకసారి ప్రదర్శనలో తీసిన ఫోటోకి నేను చేయించిన ఎన్‌లార్జ్‌మెంట్ అది. ఫోటో వంక తదేకంగా చూస్తూ, రమాకాంత్ స్థానంలో నన్ను నేను ఊహించుకోవటంలో నిమగ్న మయ్యాను.

** ** **


మేకప్ పూర్తిచేసుకొని గ్రీన్ రూమ్‌లో అద్దం ముందు కూర్చొని టచప్ చేసుకుంటున్నాను. మౌనంగా వచ్చి నా వెనుక నిలబడింది కళ్యాణి. అద్దంలో ఆమె ప్రతిబింబం చూసి వెనక్కు తిరిగాను.


"విష్ యు బెస్టాఫ్ లక్, ధైర్యంగా నటించండి, మీరు ఎక్క డయినా పోర్షన్ మర్చిపోయినా నెర్వస్‌గా ఫీల్ కాకండి, నేను ఏదో విధంగా కవర్ చేస్తాను" అన్నది చిరునవ్వుతో - రిహార్సలు చేసేటప్పుడు నేను చేసిన ఒకటి రెండు తప్పులే ఆమె చేత అలా మాట్లాడించాయన్న విషయం నేను గ్రహించగలిగాను.

ఆమె అప్పటికే మేకప్ పూర్తిచేసుకున్నది. గోధుమ రంగు చీర, జడ నిండుగా పూలచెండు, చేతులకు ఒకటి రెండు గాజులు, ఎక్కువగా అలంకరణ లేకపోయినా మూర్తీభవించిన అందంలా ఉందామె. మూడేళ్ళ సంసార జీవితం, మాతృత్వం ఆమె అందాల్ని ఏమాత్రం తగ్గించలే దనిపించింది. రమాకాంత్ ఆమె జీవితంలోంచి నిష్క్రమించిన విషాద ఛాయ లేవీ ఆమె ముఖంలో నాకు కనిపించలేదు. ఎప్పటిలాగే ఆమె సరదాగా కలుపుగోలుగా అనిపించింది.

** ** **

ఆ రోజు ప్రదర్శన ముగిశాక, నా మీద నాకు విశ్వాసం అపరిమితంగా పెరిగిపోయింది. స్టేజీ మీద కాలు పెట్టిన మరుక్షణం నుండి గోపి పాత్ర నన్ను ఆవహించనట్లయింది. నా నటన నాకు సంతృప్తి కలిగించడమే కాదు, ప్రదర్శన పూర్తయ్యాక మా కళానమితి సభ్యులందరూ నన్ను ప్రశంసలతో ముంచెత్తేశారు. వాళ్ళలో కళ్యాణి కూడా






ఉంది. ఆ తరువాత జరిగిన నాలుగు ప్రదర్శనల్లో కూడా నేను ఏమాత్రం జంకు లేకుండా నా పాత్రను నేను చాలా సునాయాసంగా పోషించాను. నాలుగవ ప్రదర్శన అనంతరం జరిగిన ఒక సంఘటన మాత్రం నా మనసుకు కొత్త ఊహలు తొడిగింది. నా జీవితం ఊహించని మలుపు తిరగడానికి కారణమైంది.

ఆఖరి ప్రదర్శన ముగించి గ్రీన్ రూమ్‌లోకి వెళ్ళిన కొద్ది క్షణాలకి కరెంట్ పోయింది. గ దంతా చిమ్మ చీకటి. నేను గదిలో ఒక మూలకి కదలి వెళ్ళాలనే ఉద్దేశంతో, కొద్దిగా పక్కకు కదిలాను. అంతే! ఎవరో వచ్చి బలంగా నన్ను కౌగిలించుకు న్నట్లయింది.

శరీరంలోని ఎత్తువల్లాలు, జడలోని పూలవాసన, నా కౌగిట్లో ఉన్నది ఎవరైనది నేను తేలిగ్గానే ఊహించగలిగాను. అయిదు నిమిషాల తర్వాత కరెంట్ వచ్చేవరకు కౌగిట్లో పారవశ్యాన్ని అనుభవిస్తూ మే మిద్దరం అలాగే ఉండిపోయాం. దీపాలు వెలగ్గానే కౌగిలి విడిచి దూరంగా జరిగింది కళ్యాణి.

ఆమె తన మనోభావాల్ని మాటల ద్వారా కాక, చేష్టల ద్వారా వ్యక్తం చేసిందనే విషయాన్ని నేను గ్రహించగలిగాను, మర్నాడు సాయంత్రం ఆమె నాకు సెండాఫ్ ఇవ్వడానికి రైల్వే స్టేషన్‌కి రావడంతో ఆ భావానికి మ రింత బలం చేకూరింది.

"మళ్ళీ మీ దర్శనం ఎప్పుడు?" అన్న దామె సూటిగా నా కళ్ళలోకి చూస్తూ. మే మిద్దరం ప్లాటుఫారం ఒక చివరగా నిలబడి ఉన్నాం. మాకు కొద్ది గజాల వరకు అసలు మనుషులు లేరు. స్టేషన్ మొత్తంమీద కూడా జనం పలచగానే ఉన్నారు. ఆమె వంక చూస్తుంటే ప్లాటుఫారం మీద కాక, ఏదో మా ఇద్దరి కోసమే ప్రత్యేకించబడిన ఏకాంత ప్రదేశంలో నిలబడి మాట్లాడుతున్న భావం గోచరించింది.

"మీకు తెలియనిది ఏ ముంది? మన తర్వాత ప్రదర్శన ఆగస్టులో అని చెప్పారుగా వెంకటేశంగారు" అన్నాను.

"అబ్బా! అయితే మీ దర్శనం కోసం అయిదు నెలలు నిరీక్షించా లన్నమాట" అన్నది ఆమె కళ్ళు వెడల్పు చేస్తూ -

ఆమె అలా అనటం నాకు ఆశ్చర్యం కలిగించింది. నేను క్రితంసారి ప్రదర్శనలకు వచ్చినప్పటికీ, ఇప్పటికీ ఆమెలో ఎంత మార్పు! అప్పుడు ఆమె దాంపత్యం నెరపుతున్న ఒక ఇల్లాలు. ఇప్పుడు నాకు చేరువ కావాలనే ప్రయత్నంలో ఉన్న ఒక ఆడది.

"నిరీక్షణ కష్ట మనిపిస్తే, మీరు ఎప్పుడు రావా లనుకుంటే అప్పుడు మా ఇంటికి రావచ్చు. మీ ఊరి నుండి మా ఊరికి బస్సులో రెండే గంటలు ప్రయాణం" అన్నాను. ఆమె మెరిసే కళ్ళతో ఏదో మాట్లాడింది. పెదాలతో మత్తుగా నవ్వింది.

ఆమె చిరునవ్వు, చూపులు, మాటలు, ప్రవర్తనా అన్ని కలిసి రంగుల వలలా నా మీద పరచుకున్నాయి. నా మనసును వశపరచుకున్నాయి. ఆమెను విడిచి వెళ్ళినా, ఆమె గురించిన ఆలోచనలు నన్ను విడిపెట్టలేదు. నా కళ్ళ ముందు చాలా తరచుగా ఆమె రూపం కదలాడేది. ఒక నెల రోజుల అంతరంగ సంఘర్షణ తరువాత నేను కళ్యాణిని పెళ్ళి చేసుకోవాలనే నిర్ణయానికి వచ్చాను. ఆమె విగత భర్తృక కావటం, మూడేళ్ళ కూతురికి తల్లి కావడం నా నిర్ణయానికి ఏమాత్రం ప్రతిబంధకాలు కాలేదు. నిర్ణయం తీసుకున్నాక ఏమాత్రం ఆలస్యం చేయకుండా నా అభిప్రాయం ఆమెకు ఉత్తరం ద్వారా తెలియజేశాను. నా ఉత్తరానికి ఆమె నుండి జవాబు వస్తుం దనుకున్నాను, కానీ నన్ను విస్మయపరుస్తూ ఆమే స్వయంగా వచ్చింది.

ఒక రోజు ఉదయం కాలింగ్ బెల్ మ్రోగింది; తలుపు తీసి చూశాను, ఎదురుగా కళ్యాణి, ఆమె కూతురు, కొద్ది దూరంలో నిలబడి ఉన్న ఆమె తండ్రి - వాళ్ళను లోపలికి ఆహ్వానించాను. ఆ తర్వాత కాలం చాలా వేగంగా నడిచింది. ఆమె వచ్చిన వారం రోజులనాడు సింహాచలం గుళ్ళో నేను, కళ్యాణి దంపతుల మయ్యాం. కళ్యాణి తరఫున ఆమె తండ్రి, నా తరఫున మా అక్కా బావ [తల్లి, తండ్రి లేని నన్ను చిన్నతనం చుంచి వాళ్ళే పెంచి పెద్ద చేశారు] మా పెళ్ళికి సారథ్యం వహించారు, పెళ్ళయిన మర్నాడు ఒక హోటల్లో మేం ఇచ్చిన విందుకి మా కళాసమితి సభ్యులే కాక, ఇతర స్నేహితులు కూడా వచ్చిమమ్మల్ని అభినందించారు.

** ** **

"మీకు నన్ను చూస్తుంటే ఏ మనిపిస్తోంది?" అన్నది కళ్యాణి మొదటి రాత్రి నా కౌగిట్లో చేరుతూ.

"ఏ విషయంలో?" అన్నాను ఆమె ముఖంలోకి చూస్తూ.

"ఆ రోజు కరెంట్ పోయినప్పుడు నిర్లజ్జగా మీ కౌగిట్లో చేరి మిమ్మల్ని కవ్వించినందుకు నా మీద మీకు కోపం రాలేదా?" అన్న దామె.

"ఊహు! ఏమాత్రం కోపం లేదు. అసలు ఆరోజు, ఆ సంఘటన జరిగి ఉండకపోతే ఈ రోజు మనం ఇలా భార్యాభర్తలం అయి వుండేవాళ్ళం కా దనిపిస్తోంది. నీలాంటి భార్య దొరకటం నా అదృష్టం కళ్యాణీ! పెళ్ళి చేసుకునే కోరికా, వయసు చాలా సంవత్సరాల క్రితమే వచ్చినా, ఎప్పటికప్పుడు నా పెళ్ళిని వాయిదా వేసుకుంటూ వస్తున్నాను ఎందుకో తెలుసా? భయం. పెళ్ళి అనే చట్రంలో ఇరుక్కుంటే నేను ప్రాణప్రదంగా ప్రేమించే నాటకరంగానికి దూరం కావలసి వస్తుందనే భయం. ఇన్నాళ్ళకి నాలాగే నాటకరంగాన్ని అమితంగా ప్రేమించే అమ్మాయి తనంత తానుగా నా జీవితంలోకి నడిచి రావటం అదృష్టం కాక మరే మంటావు? మన నాటకానికి, నీ జీవితానికి నేను హీరో కావటం నాకు కలలా అన్పిస్తోంది కళ్యాణీ!" అన్నాను.

"నా ఒంటరి జీవితానికి మీ సాహచర్యం లభించడం నేను కూడా అదృష్టంగానే భావిస్తున్నాను" అన్నది కళ్యాణి, నా కౌగిట్లో మరింతగా ఇమిడిపోతూ - తన్మయత్వంతో నేను కళ్ళు మూసుకున్నాను. నా మనోనేత్రం ముందు 'ప్రేమపక్షులు' నాటకంలో మే మిద్దరం నటించిన సన్నివేశాలు కదలసాగినాయి. ★

